క్లుప్తంగా

శాకంబరి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



ఆత్మకూరు: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయాలతో అలంకరణ చేశారు. కూరగాయలతోనే చేసిన విఘ్నేశ్వరుడు, శివలింగం ఆకృతులు ఆకట్టుకున్నాయి. మహిళా భక్తులు లలితాసహస్రనామ పారాయణం చేశారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని వినతి



కావలి: పట్టణ పరిధిలోని ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ ఇస్కల సాయిప్రసాద్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కిరణ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యాన్ని మెరుగుపరిచి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

భార్య కళ్లెదుటే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని..

నెల్లూరు(క్రైమ్): ఇంటికి భార్య రాలేదనే మనస్తాపంతో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న భర్త తీవ్రంగా గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు ఆర్టీజే కాలనీకి చెందిన మోషే శెట్టిగుంటరోడ్డుకు చెందిన పద్మను ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. రెండేళ్లుగా దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. అనుమానం వారి కాపురంలో చిచ్చురేపింది. దీంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం దంపతుల నడుమ గొడవ తారస్థాయికి చేరుకుంది. దీంతో భర్తపై అలిగి డైకస్‌రోడ్డులోని తాతయ్యబడి సమీపంలో ఉంటున్న తన అక్క అమ్ములు వద్దకు వెళ్లి అక్కడే ఉంటున్నారు. రోజూ మోషే అక్కడికి వెళ్లి భార్యను ఇంటికి రావాలని బతిమిలాడినా ఆమె నిరాకరించారు. ఈ క్రమంలో గురువారం మరోసారి వెళ్లి భార్యను ఇంటికి రావాలని కోరారు. నిరాకరించడంతో మనస్తాపానికి గురై తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆమె కళ్లెదుటే నిప్పంటించుకున్నారు. ఊహించని పరిణామంతో భార్య పెద్దగా కేకలేశారు. పద్మ, ఆమె అక్కాబావ మంటలను ఆర్పి మోషేను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు హుటాహుటిన తరలించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

నెల్లూరు(పొగతోట): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీఓ సుస్మితారెడ్డి ఆదేశించారు. నగరంలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన వెబ్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మరుగుదొడ్ల నిర్వహణ, తడి, పొడి చెత్తను వేరుచేయడం, తదితరాలపై ఆగస్టు ఒకటి నుంచి 20 వరకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానం రేపు



నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని పురమందిరంలో గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు, అభినందన సభను ఆదివారం నిర్వహించనున్నామని గౌడ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షులు తోట ప్రభాకర్, కోసూరు రాజశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను సుజాతమ్మ కాలనీలోని దివంగత కోసూరు గోవిందయ్య గౌడ్ నివాసంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పదో తరగతిలో అత్యధిక మార్కులను సాధించిన 133 మంది గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని వివరించారు. నేతలు ముత్యంగౌడ్, శ్రీనివాసులు, రమణయ్య, రామకృష్ణ, సుబ్బారావు, రామచంద్రయ్య, నిమ్మల సుబ్బయ్య, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి



మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

ఆత్మకూరు: అంగన్‌వాడీలు, వార్డెన్లు, రేషన్ డీలర్లు జవాబుదారీతనంతో బాధ్యతగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఎంఈఓలు, రేషన్ డీలర్లు, పౌర సరఫరాల శాఖ సిబ్బందితో మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో సరఫరా చేసే బియ్యం సద్వినియోగం అయ్యేలా వార్డెన్లు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు చూడాలన్నారు. రేషన్ సరుకుల స్టాక్ పాయింట్ల నుంచి డీలర్లకు తక్కువ తూకంతో సరుకులు సరఫరా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పట్టుబడితే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్‌ఓతో పాటు సివిల్ సప్లయిస్ అధికారులు తరచూ తనిఖీలు చేస్తే ఇలాంటి పొరపాట్లు జరగవన్నారు. పాఠశాలల్లో గోరుముద్ద అమలుపై ఎంఈఓలు, హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, గురుకులాల్లో భోజనం నాణ్యతను ఏఎస్‌డబ్ల్యూఓలు, వార్డెన్లు తరచూ పరిశీలించాలన్నారు. ప్రస్తుతం హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం ఎంతో నాణ్యతతో కూడినవన్నారు. ప్రభుత్వాలు కిలో రూ.60 చొప్పున కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారని తెలిపారు. కాలపరిమితి దాటిన సరుకులను చిన్నారులు, విద్యార్థులకు వడ్డించరాదని సూచించారు. జిల్లాలో తాను తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో పరిస్థితి సంతృప్తికరంగా ఉందన్నారు. కోడిగుడ్ల సైజు, నాణ్యత బాగుందని కితాబునిచ్చారు. అనంతరం బైపాస్ రోడ్డులోని ఏపీ బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. ఫుడ్ కమిషన్ డీడీ సురేష్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, ఆత్మకూరు తహసీల్దార్ లక్ష్మీ నరసింహం, ఎంఈఓ ఎస్కే నజీర్, సీడీపీఓ జైనకుమారి, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీదేవి పాల్గొన్నారు.

మెనూను అమలు చేయకపోతే క్రిమినల్ కేసులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : విద్యార్థులకు భోజనం అందించే విషయంలో రాజీపడేది లేదని, మెనూను అమలు చేయకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనుకాడబోమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. మర్రిపాడు మండలం నందవరం ఆదర్శ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల హాస్టల్‌లో వంటలను రుచి చూశారు. వంటకు వినియోగిస్తున్న సరుకులను పరిశీలించారు. నూనె ప్యాకెట్లలో కొన్ని కాలం చెల్లినవి ఉండడంతో సిబ్బందిని తీవ్రంగా మందలించారు. వసతిగృహ విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని, వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రత్యేకంగా మెనూను అమలు చేస్తోందన్నారు. గతంలో ఆదర్శ పాఠశాలల్లోని విద్యార్థికి నెలకు రూ.1256 వంతున కేటాయిస్తుండగా, ఇటీవల రూ.1400కు పెంచిందని తెలిపారు. త్వరలోనే కొత్త మెనూ అమల్లోకి వస్తుందన్నారు. హాస్టల్ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా 94905 51117 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వసతిగృహ విద్యార్థులు తమకు 8 నెలలుగా వార్డెన్ లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్నవించారు. స్పందించిన విజయప్రతాప్‌రెడ్డి వెంటనే డీఈఓ గంగాభవానికి ఫోన్ చేసి తక్షణమే వార్డెన్‌ను నియమించాలని ఆదేశించారు. మరో నెల రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకుంటే తనకు ఫోన్ ద్వారా తెలియచేయాలని ప్రిన్సిపల్ పేట శ్రీనివాసులురెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట జీసీడీఓ మమత, ఎంఈఓ ధనలక్ష్మి, పౌర సరఫరాల శాఖ డీటీ వెంకటశేషయ్య, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అనుమతి మేరకే పొగాకు పండించాలి



రైతులతో మాట్లాడుతున్న పొగాకు బోర్డు ఒంగోలు ఆర్‌ఎం లక్ష్మణరావు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): పొగాకు బోర్డు అనుమతించిన మేరకే రైతులు పొగాకు పంటను ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు ఒంగోలు రీజనల్ మేనేజరు లక్ష్మణరావు సూచించారు. డీసీపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గత రెండేళ్లుగా పొగాకు రైతులకు మంచి ధరలు దక్కడంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఇదే అదునుగా రానున్న సీజన్‌లో అధికంగా పొగాకు సాగు చేయడానికి రైతులు ఉత్సాహపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికంగా సాగు చేయడం వల్ల పొగాకు ధరలు తగ్గి ఆర్థికంగా నష్టపోతారన్నారు. పొగాకు బోర్డు ద్వారా అందజేసే ఎరువులు అవసరమైన రైతులు ఈ నెల 26లోగా నమోదు చేసుకోవాలని కోరారు. కందుకూరులోని పీటీఆర్ఐ కేంద్రంలో ఈ నెల 19 నుంచి రైతులకు పొగాకు విత్తనాల విక్రయాలను ప్రారంభిస్తామని తెలిపారు. నారుమడులు పోసి విక్రయించే రైతులకు ఆగస్టు 1 నుంచి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.పొగాకు సాగుకు ముందు భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట పైర్లు సాగుచేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్, పొగాకు రైతు నాయకులు రామిరెడ్డి మోహన్‌రెడ్డి, సుబ్బారాయుడు, తదితరులు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి టోల్‌ప్లాజా సమీపంలో 67వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర ప్రమాదం త్రుటిలో తప్పింది. పోలీసుల వివరాల మేరకు..హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ గౌస్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఏఎస్‌పేట దర్గాను సందర్శించేందుకు కారులో బయలుదేరారు. డీసీపల్లి టోల్‌ప్లాజా సమీపంలో ఆత్మకూరు మండలం యర్రబల్లికి చెందిన రాజా, హజరత్తయ్య మోటార్ సైకిల్‌పై వస్తూ కారుకు అడ్డుగా వచ్చారు. వారిని తప్పించే క్రమంలో కారు రహదారి పక్కనే ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న రాజా, హజరత్తయ్యకు స్వల్ప గాయాలవగా ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న రహమ్మత్, అబ్బాస్, రహీమా, మరియంతో పాటు వారి చిన్నారులు ఆయేషా, అహమ్మద్‌కు స్వల్పగాయాలవగా హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించి మరో వాహనంలో ఏఎస్‌పేట దర్గాకు పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్సిడీపై టమాటాల విక్రయం



సబ్సిడీ టమాటాల విక్రయాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ

ఆత్మకూరురూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సబ్సిడీ టమాటా విక్రయ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారపు వెంకటరమణమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిల్లూరు ఆదిశేషయ్య, సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ టమాటా ధరలు మండుతుండంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలకు సబ్సిడీపై టామాటాలు అందించేందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఏఎంసీ కార్యాలయంలో విక్రయ కేంద్రాన్ని ప్రారంభించి రూ.50కే కిలో టమాటాలు అందజేస్తున్నారని తెలిపారు. ఏఎంసీ కార్యదర్శి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఒక్కొక్కరికి కిలో చొప్పున 2వేల కిలోల టమాటాలను విక్రయించినట్లు వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్ మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు నోటి వినయకుమార్, కలాం, మణి, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి మెగా ఉచిత కంటి వైద్యశిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ రాఘవరెడ్డి

ఆత్మకూరు: దివంగత సీఎం వైఎస్సార్ స్ఫూర్తితో సొంతూరికి సేవ చేయాలనే సదాశయంతో ఏఎస్‌పేటలో ఈ నెల 16 నుంచి పదకొండురోజుల పాటు మెగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఏఎస్‌పేట మండలం కొండమీదకొండూరుకు చెందిన ఎన్ఆర్ఐ డాక్టర్ జీ రాఘవరెడ్డి తెలిపారు. పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏడీఎఫ్ ద్వారా ఆత్మకూరు ప్రాంత అభివృద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ వైద్యుల సహకారంతో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ప్రత్యేక మొబైల్ ఐకేర్ సర్జికల్ యూనిట్ వాహనాల్లో శస్త్రచికిత్సలు చేస్తారని వివరించారు. ఏఎస్‌పేటలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహించే మెగా కంటి వైద్యశిబిరాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరయ్యే వారికి భోజన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పులిమి రమేష్‌రెడ్డి, కొండూరు సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఉదయగిరి: పట్టణంలోని దిలావర్‌భాయి వీధికి చెందిన షేక్ రషీద్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యఖర్చుల నిమిత్తం గండిపాళేనికి చెందిన సేవాగుణ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం రూ.7 వేలు సాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు, మిత్రబృందం పాల్గొన్నారు.

డీటీ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా సీహెచ్ శ్యామ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పొదలకూరు సివిల్ సప్లయిస్ గోదాము ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఉదయగిరి డీటీగా వచ్చారు.

ఎంపీపీకి సన్మానం



చేజర్ల: మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికైన తూమాటి విజయభాస్కర్‌రెడ్డిని చేజర్లలోని ఆయన నివాసంలో పొదలకూరు సాంఘీక సంక్షేమ శాఖ అధికారి దేవిరెడ్డి నరసింహారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో క్షయ రోగులకు శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. జిల్లా క్షయ నియంత్రణాధికారి బ్రిజిత రోగులకు పౌష్టికాహారంతో పాటు మందులు అందజేశారు. ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం, ఆర్ఎంఓ ఉషాసుందరి, కంటి వైద్యురాలు శార్వాణి, సిబ్బంది సీహెచ్ సుధాకర్, కే వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ వలంటీర్లకు ఆహ్వానం



కావలి: రెడ్‌క్రాస్ ద్వారా సమాజ సేవ చేయాలనుకునే వారు వలంటీర్లుగా నమోదు చేసుకోవాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు రవిప్రకాష్ కోరారు. శుక్రవారం కావలి రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచనల మేరకు రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఏ శ్రీధర్‌రెడ్డి వన్‌మిలియన్ వలంటీర్ల నమోదు చేపట్టాలని సూచించారన్నారు. రెడ్‌క్రాస్ వలంటీర్‌గా స్వచ్ఛందంగా సేవ చేయాలనుకునే వారు గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఏపీ రెడ్‌క్రాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

23న ఉచిత వైద్యశిబిరం

కావలి: పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఈ నెల 23న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపకుడు సురేంద్ర తెలిపారు. కావలి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల డైరెక్టర్ మాలకొండయ్య, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కరోనా కష్టకాలంలో అండగా..



కోవిడ్ సమయంలో వరలక్ష్మికి పోషకాహారం, మందులు అందజేస్తున్న వలంటీర్ భారతి (ఫైల్)

జలదంకి: ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చిన గుర్తుకొచ్చేది వలంటీర్లే. కరోనా మహమ్మారి సమయంలోనూ వారు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించారు. మండలంలోని కమ్మవారిపాళెం సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న పెనుమల భారతి సైతం కోవిడ్ లాక్‌డౌన్‌లో ప్రతిరోజూ గ్రామంలో పర్యటించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటూ కోవిడ్ జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పేద కుటుంబానికి చెందిన వడ్డే వరలక్ష్మి కుమార్తె అనూష నిండు గర్భిణి కావడంతో ఆమెకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేసే పోషకాహారం, ఆరోగ్యానికి అవసమైన మందులను అందజేసి కోవిడ్ బారిన పడకుండా సేవలు అందించింది. తన క్లస్టర్ పరిధిలో ఒక్కరు కూడా కరోనా బారిన పడకుండా జాగ్రత్తలను తెలియజేసింది.

వలంటీర్ సేవలను మరువలేం



కరోనా సోకుతుందని మనిషికి మనిషికీ దూరమైన సమయంలో వలంటీర్ భారతి మాకందించిన సేవలు మరువలేము. నా కూతురు గర్భిణి కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడేవాళ్లం. వలంటీర్ రెండ్రోజులకు ఒకసారి ఏఎన్‌ఎంతో కలిసి వచ్చి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేవారు. నా కూతురుకు అవసమైన మందులు, పోషకాహారం అందజేసే వారు. ప్రభుత్వం నుంచి రూ.1000 ఆర్థిక సాయం కూడా అందజేశారు.

–వడ్డే వరలక్ష్మి, కమ్మవారిపాళెం

చిన్నారికి ఆర్థిక సాయం



ధనుష్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న మేకపాటి

కలిగిరి: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని కుమ్మరకొండూరు ఎస్సీకాలనీకి చెందిన 13 ఏళ్ల బాలుడు దువ్వూరి ధనుష్‌కు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం రూ.5వేలు సాయం అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎస్సీ కాలనీలో పర్యటించిన ఆయన ధనుష్‌ను పరామర్శించారు. చిన్నవయస్సులోనే దయాలసిస్ చేయించుకుంటున్న విషయం తెలుసుకుని చలించిపోయి తక్షణ సాయంగా రూ.5వేలు అందజేశారు.

బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావ్

ఉదయగిరి: బీఎల్వోలు బాధ్యతగా ఓటరు జాబితాలను రూపొందించాలని డ్వామా పీడీ, ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్రావ్ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి, సీతారామపురం మండలాలకు చెందిన బీఎల్వోలతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. ఇంటింటికీ తిరిగి ఓటర్ల సవరణ చేపట్టాలన్నారు. ఒకే పోలింగ్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులందరి ఓట్లు ఉండేలా చూడాలన్నారు. వలసవాసుల, మృతిచెందిన ఓటర్ల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు జగదీష్‌బాబు, షాజియా, బీఎల్వోలు పాల్గొన్నారు.

నార్తుమోపూరులో జగనన్న సురక్ష శిబిరం



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

అల్లూరు: మండలంలోని నార్త్‌మోపూరు సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపును శుక్రవారం నిర్వహించారు. జగనన్న సురక్ష సర్వేలో వివిధ సేవలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సురేంద్ర, ఎంపీడీఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మధురెడ్డి, షేక్ ఉస్మాన్, చెంతాటి కరుణాకర్, వెంకటేశ్వర్లు, బుర్రి మల్లికార్జున, టీ భాస్కర్, నిమ్మల భాస్కర్, బత్తల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ఫిర్దోస్



నిఖిత



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సంగం విద్యార్థులు

సంగం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. తరుణవాయి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన షేక్ షాకీరా, మోచెర్ల హిమబిందు, అన్నారెడ్డిపాళెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బీ కోటిభార్గవ్, బీ శివగీతిక, బీ స్మైలి, సీహెచ్ హిమవర్షిని, మర్రిపాడు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కాకార్ల అనంత్ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా వారిని ఎంఈఓ జానకీరాం శుక్రవారం అభినందించారు.

దుత్తలూరు: స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. బానా వెంకటనాగలక్ష్మి నూజివీడు, బడే సుమిత్ర ఇడుపులపాయ, సీహెచ్ సుస్మిత, రావిళ్ల నవ్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జే సైమన్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు షేక్ సాదియా, షేక్ ఫిర్దోస్ ట్రిపుల్ ఐటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పీ మాలకొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కొండాపురం: స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని నిఖిత ఇడుపాలపాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు హెచ్‌ఎం రహీమ్ శుక్రవారం తెలిపారు. చింతలదేవికి చెందిన నిఖిత 564 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికవడంపై ఉపాధ్యాయులు అభినందించారు.



బీ సుమిత్ర



బీ వెంకటనాగలక్ష్మి



ఆర్ నవ్య



సీహెచ్.సుస్మిత



సాదియా